## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, ఆర్‌సి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

**94916 28386 85220 22029**

**Land Line No : 08517 224194**



RNI Rgd NO : 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక



తెలంగాణ - శ్రీ ప్రస్థానం



Call : 8522022029, 9491628386



కర్నూలు సంపుటి : 03 సంచిక : 356 శనివారం 30-03-2024 పేజీలు :04 వెల:రూ.2.00


## లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు భారీ షాక్..

### రూ.1700 కోట్లకు ఇన్‌కమ్ ట్యాక్స్ నోటీసులు




న్యూఢిల్లీ, మార్చి 29: లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆదాయపు పన్నుకు సంబంధించి కాంగ్రెస్‌కు మరోసారి ఐటీ నుంచి నోటీసులు అందాయి. 2017-18 నుంచి 2020-21 అసెస్‌మెంట్ సంవత్సరాలకు సంబంధించి పెనాల్టీ, వడ్డీతో సహా దాదాపు రూ. 1700 కోట్ల నోటీసును ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ అందజేసిందని కాంగ్రెస్ పార్టీ గురువారం (మార్చి 29) సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. నాలుగు అసెస్‌మెంట్ సంవత్సరాలకు సంబంధించిన రీఅసెస్‌మెంట్ ప్రొసీడింగ్‌లను సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టులో చేసిన అప్పీల్‌ను కోర్టు తోసిపుచ్చిన గంటల వ్యవధిలోనే ఐటీ నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో స్తంభించిన బ్యాంకు ఖాతాల వల్ల నగదు కొరత ఏర్పడింది. మరోవైపు తాజా నోటీసులతో కాంగ్రెస్ ఇరకాటంలో పడ్డట్లైంది. దెబ్బ మీద దెబ్బ పడటంతో కాంగ్రెస్ నేతల్లో ఆందోళన నెలకొంది. ఎలాంటి మదింపు ఉత్తర్వులు, పత్రాలు లేకుండానే గురువారం ఐటీ నోటీసులిచ్చినట్లు కాంగ్రెస్ లాయర్, రాజ్యసభ ఎంపీ వివేక్ తంఖా ఆరోపించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని, అసమంజసమైనదని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీని ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసేందుకు కేంద్రం ఇదంతా చేస్తుందని ఆయన దుయ్యబట్టారు. దీన్ని తాము చట్టపరంగా సవాల్ చేస్తామన్నారు. కాగా 2017 నుంచి 2021 మధ్య కాలానికి ఆదాయపు పన్ను(ఐటీ) విభాగం చేపట్టిన పునఃపరిశీలన ప్రక్రియను నిలిపివేయాలంటూ కాంగ్రెస్ గత వారం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటీషన్‌లో కాంగ్రెస్ పార్టీ 2014-15 నుంచి 2016-17 అసెస్‌మెంట్ సంవత్సరాలకు సంబంధించిన రీఅసెస్‌మెంట్ ప్రొసీడింగ్‌లను నిలిపివేయాలని కోరుతూ సవాలు చేసింది. ఈ పిటిషన్ల విచారణ సమయంలో ఈ మూడేళ్లలో దాదాపు రూ. 520 కోట్లు మదింపు నుంచి తప్పించుకున్నట్లు పన్ను శాఖ వాదించింది. ఐటీ శాఖ ఖచ్చితమైన సాక్ష్యాలను సమర్పించినందున న్యాయమూర్తులు యశ్వంత్ వర్మ, పురుషైంద్ర కుమార్ కౌరవ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ పిటీషన్లను కొట్టేసింది. 2014-15 నుంచి 2016-17 వరకు ఐటీ పన్నులకు సంబంధించి గతంలో ఇచ్చిన తీర్పు తాజా పిటిషన్‌కు కూడా వర్తిస్తుందని ధర్మాసనం పేర్కొంది. ఇక 2018-19 అసెస్‌మెంట్ సంవత్సరానికి పన్ను బకాయిలు, వడ్డీలకు సంబంధించి కాంగ్రెస్ ఢిల్లీ బ్యాంక్ ఖాతాల నుంచి ఇప్పటికే రూ. 135 కోట్లను ఆదాయ పన్ను శాఖ రికవరీ చేసింది.

## సిఎం రేవంత్ రెడ్డితో కెకె భేటీ



హైదరాబాద్,మార్చి29 :ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రాజ్యసభ సభ్యుడు కే.కేశవరావు భేటీ అయ్యారు. డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డితో కలిసి సీఎం నివాసానికి వెళ్లిన కేకే.. ముఖ్యమంత్రితో పార్టీ చేరికకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు తెలుస్తున్నది. తాను బీఆర్ఎస్ నుంచి సొంతగూటికి చేరుతున్నట్లు కెకె ఇప్పటికే ప్రకటించిన విషయం విదితమే. ఆయన కూతురు, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి కూడా కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. ఇటీవల వారితో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలోకి తిరిగిరావాలని ఆహ్వానించారని చెప్పారు. దీంతో 84 ఏండ్ల వయసులో తిరిగి సొంత ఇంటికి వెళ్లాలన్న ఆలోచన తనకు కూడా కలిగిందని కేకే అన్నారు. బీఆర్ఎస్‌లో తనకు సముచిత గౌరవం దక్కిందని, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ తనకు గౌరవం ఇచ్చారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు కూడా తనను బాగా చూసుకున్నారని అన్నారు. తాను, తన కుమార్తె, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి కాంగ్రెస్‌లోకి వెళ్లాలన్న ఆలోచనతో ఉన్నామని చెప్పారు. తన కుమారుడు

### కాంగ్రెస్‌లో చేరికపై ఇరు నేతల చర్చలు
### తన పుట్టిల్లు కాంగ్రెస్ అంటూ కేశవరావు వ్యాఖ్య

విప్లవ్ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని చెప్పాడని వెల్లడించారు. కేకే నిన్న బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పిన విషయం తెలిసిందే. చనిపోయే వరకూ కాంగ్రెస్ లోనే ఉంటానని కేకే తెలిపారు. రేపు ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నారు. కేకే కాంగ్రెస్ పార్టీలో చేరనుండటంతో ఒక్కసారిగా రాష్ట్రంలో కలకలం ప్రారంభమైంది. ముందుగా ఆయన కుమార్తె విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరతారని.. ఆమె చేరిన తర్వాత కేకే పార్టీ మారే అవకాశం ఉందంటూ తొలుత ప్రచారం జరిగింది. కానీ ఆమె కంటే ముందుగానే రేవంత్‌తో కేకే భేటీ అవడం గమనార్హం. కాంగ్రెస్‌లో చేరడంపై కేశవరావు తాజాగా ప్రకటన చేశారు. కాంగ్రెస్ తనకు సొంత ఇల్లులాంటిదని చెప్పారు. తీర్థయాత్రలకు వెళ్లిన వారు ఎప్పటికైనా ఇంటికే చేరుతారని.. తాను కూడా తన సొంత ఇల్లు కాంగ్రెస్‌లో చేరుతానని స్పష్టం చేశారు. 53ఏళ్లు కాంగ్రెస్‌లో పని చేశానని అన్నారు. బీఆర్ఎస్‌లో తాను పని చేసింది కేవలం పదేళ్లు మాత్రమేనని తెలిపారు. తెలంగాణ కోసమే బీఆర్ఎస్‌లో చేరానని అన్నారు. కాంగ్రెస్ పార్టీయే తెలంగాణ ఇచ్చిందన్నారు. తాను మొదటిసారి కాంగ్రెస్ రెండో ప్రాధాన్యత ఓట్లతోనే రాజ్యసభకు ఎన్నికయ్యానని కేశవరావు తేల్చిచెప్పారు. తాను పుట్టింది, పెరిగింది, కాంగ్రెస్‌లో నేనని... ఆ పార్టీలోనే చనిపోవాలని అనుకుంటున్నానని చెప్పారు. తాను బీఆర్ఎస్‌కు ఇంకా రిజైన్ చేయలేదన్నారు. తన కూతురు కాంగ్రెస్‌లో చేరిన రోజు.. తాను ఆ పార్టీలో చేరట్లేదన్నారు. కాంగ్రెస్‌లో చేరే తేదీ ఖరారు అయిన తర్వాత తానే చెబుతానని అన్నారు. తన కుమారుడు మాత్రం బీఆర్ఎస్‌లోనే ఉండాలని అనుకుంటున్నారన్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతున్నారని కేశవరావు స్పష్టం చేశారు.

## జమ్మూ-శ్రీనగర్ హైవేపై ఘోర ప్రమాదం..

### క్యాబ్ కాలువలో పడి 10 మంది దుర్మరణం

జమ్మూ కాశ్మీర్‌లో శుక్రవారం (మార్చి 29) ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై రాంబన్ సమీపంలో క్యాబ్ కాలువలో పడిపోవడంతో అందులోని ప్రయాణిస్తున్న 10 మంది మరణించారు. క్యాబ్ ప్రయాణికులతో జమ్మూ నుండి శ్రీనగర్ వెళ్తుండగా అదుపుతప్పి ప్రమాదానికి గురై కాలువలో పడిపోయింది. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు పోలీసులు. జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై రాంబన్ ప్రాంతంలోని బ్యాటరీ చష్మా సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న క్యాబ్ లోతైన గుంతలో పడిపోయింది. స్థానిక అధికారులకు ఈ సంఘటన గురించి సమాచారం అందిన వెంటనే, పోలీసులు, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ాఆఖీఈ), రాంబన్ నుండి సివిల్ క్విక్ రెస్పాన్స్ టీమ్ (ఖఖీ) వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాలువలోకి దిగిన బృందం సహాయక చర్యలు ప్రారంభించి మృతదేహాలను బయటకు తీశారు. మరోవైపు, తెల్లవారుజాము నుంచే రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభమైంది. ఇప్పటివరకు 10 మంది మృతదేహాలను వెలికి తీశారు. అయితే, ఈ ప్రాంతంలో లోతైన కందకాలు, చీకటి, కుండపోత వర్షం కారణంగా రెస్క్యూ ఆపరేషన్ సవాలుగా మారుతోంది. మధ్యమధ్యలో కొంత సేపు సహాయక చర్యలు ఆగిపోయాయని సమాచారం. రెస్క్యూ ఆపరేషన్‌లో అతిపెద్ద సమస్య వర్షం, దీని వల్ల రెస్క్యూ సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 1.15 గంటల ప్రాంతంలో ప్రమాదం జరిగినట్లు సమాచారం అందినట్లు పోలీసులు తెలిపారు. తవీరా కారుతో క్యాబ్ ప్రయాణికులతో కాశ్మీర్‌కు వెళ్తుండగా, మార్గమధ్యంలో అకస్మాత్తుగా అవాంఛనీయ సంఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై 300 మీటర్ల లోతైన లోయలో క్యాబ్ పడిపోయింది.
ఇప్పటి వరకు బయటకు తీసిన మృతదేహాలను ఆస్పత్రికి తరలించి, కుటుంబీకులకు సమాచారం అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాంబన్ ప్రమాదంపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదంపై డీసీ రాంబన్ బషీర్ ఉల్ హక్ తో మాట్లాడినట్లు తెలిపారు. పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్, సివిల్ క్యూఆర్‌టీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రెస్క్యూ ఆపరేషన్ జరుగుతోంది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్.



## రంజిత్ రెడ్డి పార్టీకి ద్రోహం చేసిండు.. కేసీఆర్ కాళ్లు పట్టుకున్న మళ్లీ రానివ్వం : కేటీఆర్

హైదరాబాద్ : చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేశారని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ రేపు వచ్చి ఇదే రంజిత్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి.. కేసీఆర్ కాళ్లు పట్టుకున్నా పార్టీలోకి రానివ్వం. వాళ్లకుండా తప్పకుండా బుద్ధి చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన చేవెళ్ల పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని స్పందించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలు గెలిచిన తర్వాత.. రంజిత్ రెడ్డి ఫోన్ చేసి ఏదేమైనా సరే.. అడ్వాన్స్‌గా ఎన్నికలకు పోవాలి.. ఫస్ట్ మీటింగ్ చేవెళ్లలో పెట్టి నన్ను అభ్యర్థిగా డిక్లేర్ చేస్తే పనిలో పడుతాను.. చేవెళ్లలో గెలిచి చూపించాలి. ఇక అందరికీ ఫోన్ చేసి తెలంగాణ భవన్‌లో మీటింగ్ పెట్టాం. అన్ని నియోజకవర్గాల్లో కార్యకర్తల సమావేశాలు




పెట్టుకోవాలని నిర్ణయించుకున్నాం. అన్ని నియోజకవర్గాల్లో తిరుగుదాం అని నిర్ణయించుకున్నాం. నేనే చేవెళ్ల అభ్యర్థిని రంజిత్ రెడ్డి మీడియాతో చెప్పారు. ఇక భవన్ నుంచే చేవెళ్ల, పరిగి పర్యటనకు రంజిత్ రెడ్డితో కలిసి కారులో బయల్దేరాం. మన్నెగూడ వద్ద పట్నం మహేందర్ రెడ్డి కారు ఎక్కారు. ముగ్గురం కలిసి పోతుంటే.. మహేందర్ రెడ్డికి నీ మీద పుకార్లు వస్తున్నాయి అని చెప్పాను అని కేటీఆర్ తెలిపారు.

**పొల్లుపొల్లు తిట్టిన 15 రోజులకే కాంగ్రెస్‌లోకి..**

ఇక పరిగి, చేవెళ్ల మీటింగ్స్‌లో నా కంటే ఎక్కువగా కాంగ్రెస్ పార్టీని పొల్లుపొల్లు తిట్టారు. పరిగిలో నాలుగైదు వేల మంది మీటింగ్‌లో ఉన్నారు. కారులో చెప్పిన ముచ్చట కార్యకర్తల ముందు చెప్పమని పట్నం మహేందర్ రెడ్డికి సూచించాను. కాంగ్రెస్‌లోకి పోతున్నట్లు నా మీద పుకార్లు వస్తున్నాయి. నా ఒక్కని మీద వస్తలేవు.. రంజిత్ రెడడి మీద కూడా వస్తున్నాయి అని మహేందర్ రెడ్డి అన్నారు. ఇక ఇద్దరు లొల్లి పెట్టుకున్నారు. ఆస్కార్ అవార్డు కంటే ఎక్కువగా యాక్టింగ్ చేశారు. నేను ఇద్దర్నీ నమ్మాను. అద్భుతమైన స్పీచ్‌లు ఇచ్చారు. చూస్తే 15 రోజుల తర్వాత కాంగ్రెస్ అభ్యర్థులుగా ప్రకటించారు అని కేటీఆర్ తెలిపారు.

**విశ్వేశ్వర్ రెడ్డికి పట్టిన గతే రంజిత్‌కు..**

2014లో విశ్వేశ్వర్ రెడ్డిని పట్టుబట్టి పార్టీలోకి తీసుకొచ్చాను. ఆయనకు ఏమైందో తెలియదు కానీ కాంగ్రెస్‌లోకి వెళ్లారు. 2018లో విశ్వేశ్వర్ రెడ్డిని ప్రజలు ఓడగొట్టారు. 2018లో రంజిత్ రెడ్డి కొత్త వ్యక్తి అయినా మీరందరూ ఆశీర్వదించి గెలిపించారు. ఇవాళ రంజిత్ రెడ్డి ద్రోహం చేశారు. బయటివాడు మోసం చేస్తే బాధ అనిపించదు. నీతోనే నీడలాగా తిరిగి, నీతోనే అన్ని మంచి మాటలు చెప్పి, కష్టకాలంలో ఉంటామని మాట చెప్పి.. కవిత అరెస్టు అయినరోజే నవ్వుకుంటా రంజిత్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దాన్ని మనం తప్పకుండా తీర్చుకోవాలి. రాజకీయాల్లో ఎవరికీ అధికారం శాశ్వతం కాదు. అధికారం పోగానే తమ స్వీయ ప్రయోజనాల కోసం ద్రోహం చేసి పోతున్నారు. చందన్‌వెల్లిలో రంజిత్ రెడ్డినే పరిశ్రమలు తెచ్చారట. కాలే యాదయ్య, అవినాష్ రెడ్డి సహకారం లేకుండానే పరిశ్రమలు తీసుకొచ్చానని రంజిత్ రెడ్డి అంటున్నారు. ఇంతకంటే సిగ్గు చేటు ఉండదు. మళ్లీ రేపు వచ్చి ఇదే పట్నం మహేందర్ రెడ్డి, రంజిత్ రెడ్డి కేసీఆర్ కాళ్లు పట్టుకున్నా పార్టీలోకి రానివ్వం. వాళ్లకుండా తప్పకుండా బుద్ధి చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు.

## భారత్‌లో ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా జరగాలి: ఐక్యరాజ్యసమితి



న్యూయార్క్: భారత్‌లో జరిగే లోక్‌సభ ఎన్నికలు.. స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ప్రతినిధి స్టీఫేన్ డుజారిక్ తెలిపారు. భారత్‌లో అయినా, మరో దేశంలో అయినా ఎన్నికలు జరిగితే, అక్కడ ప్రజల రాజకీయ, పౌర హక్కుల్ని రక్షించాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు కూడా స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భారత్‌లో రాజకీయ అనిశ్చితి నెలకొన్నట్లు ఓ రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు స్టీఫేన్ డుజారిక్ బదులు ఇస్తూ ఆ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టు, కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అకౌంట్లు సీజ్ లాంటి అంశాలపై ఇటీవల అమెరికాతో పాటు జర్మనీ దేశాలు కూడా స్పందించిన విషయం తెలిసిందే. కేజ్రీ అరెస్టుపై అమెరికా కామెంట్ చేసిన నేపథ్యంలో ఆ దేశ ప్రతినిధి మాథ్యూ మిల్లర్‌కు సమన్లు కూడా జారీ చేశారు.

## సిఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు

### కెటిఆర్‌పై హన్మకొండలో కాంగ్రెస్ నేతల కేసు

హనుమకొండ,మార్చి29: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై పిసిసి నాయ కుడు బత్తిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు హనుమకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిఎం రేవంత్ రెడ్డి రూ. 2,500 కోట్లను కాంట్రాక్టర్లు, బిల్డర్ల వద్ద వసూలు చేసి ఢిల్లీకి పంపించారని కెటిఆర్ తప్పుడు ఆరోపణలు చేశారని, లోక్‌సభ ఎన్నికల తర్వాత బిజెపి లోకి వెళతారని అబద్దాలు చెప్పి సిఎం స్థాయిని తగ్గించేలా మాట్లాడారని, తద్వారా ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళుతున్నాయంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## కెసిఆర్‌ను వెన్నాడుతున్న పాపాలు

### యాదగిరిగుట్ట పేరు మార్చడమే మొదటి తప్పు
### దేవుడిపేరుతో అక్రమాలు,అవినీతికి తెగించారు
### కాళేశ్వరంలోనూ అక్రమాలు అనేకం
### ఫోన్ ట్యాపింగ్ ఏ రాష్ట్రంలోనూ లేదు
### మంత్రి కోమటిరెడ్డి ఘాటు విమర్శలు

హైదరాబాద్,మార్చి29: బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ గతంలో చేసిన పాపాలే.. ప్రస్తుతం ఆయన్ని చుట్టుముడుతున్నాయని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో చిట్ చాట్‌గా మాట్లాడారు. గతంలో కేసీఆర్ పాలనను ఈ సందర్భంగా ఆయన తూర్పారబెట్టారు. యాదగిరిగుట్ట పేరు మార్చడమే కేసీఆర్ చేసిన మొదటి తప్పు అని ఆయన స్పష్టం చేశారు. దేవుడిపేరుతో అక్రమాలు,అవినీతికి తెగించారని మండిపడ్డారు. కేసీఆర్ చేసిన పాపాల వల్లే రాష్ట్రంలో కరువు వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే వర్షం.. వర్షం అంటే కాంగ్రెస్ పార్టీ అన్నట్లుగా ఉండేదని... కానీ కేసీఆర్ పాలనలో అలా లేదని చెప్పారు. ఎండిన పంటలను చూస్తుంటే ఏడుపు వస్తోందన్నారు. ఇక దేవుడి పేరు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి సర్వనాశనం చేశారంటూ కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. మా జిల్లాను నాశనం చేసి మళ్లీ ఏ మొఖం పెట్టుకోని నల్గొండ వస్తారంటూ కేసీఆర్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ అధికారులతో సైతం పాపపు పనులు చేయించారన్నారు. దీంతో ఆ పాపంలో భాగస్వామ్యులైన అధికారులు నిద్రపోవడం లేదని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అందరికి ఇండ్లు ఇచ్చామని.. అయితే కేసీఆర్ ఎవరికి ఇండ్లు ఇచ్చారో ఎవ్వరికీ తెలియదంటూ కోమటిరెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దళితబంధు, సీఎంఆర్ఎఫ్‌పై కమిషన్లు సైతం దండుకున్నారని గుర్తు చేశారు. అలాగే యాదగిరి గుట్టలో



స్కాం జరిగిందని.. దీనిపై లోక్‌సభ ఎన్నికలు పూర్తైన తర్వాత విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. అలాగే యాదాద్రి పేరు మళ్ళీ యాదగిరి గుట్టగా మారుస్తామని.. అయితే ఇది ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత దీనిపై ప్రభుత్వం జీవో జారీ చేస్తుందన్నారు.

# శ్రీ ప్రస్థానం

## సంపాదకీయం

### వ్యక్తి కేంద్ర రాజకీయాలకు మంగళమేనా

దేశంలో వ్యక్తి కేంద్రంగా పనిచేస్తున్న రాజకీయ పార్టీలు సంక్షోభ స్థితిని ఎదుర్కొంటున్నాయి. విశేష ప్రజాదరణ కల్గిన ఒక 'బలమైన నేత' లేదా కుటుంబాన్ని ఆధారంగా చేసుకుని పనిచేస్తున్న రాజకీయ పార్టీల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. పార్టీ సిద్ధాంతాలు, క్షేత్రస్థాయి నుంచి నిర్మాణం వదిలిపెట్టి వ్యక్తిపూజతో ఒక నేత కేంద్రంగా పనిచేసిన పార్టీలు.. ఆ నేత బలహీనపడినా, లోకం నుంచి నిష్క్రమించినా ఒక్కసారిగా చతికిలపడుతున్నాయి. ఒక్క దశాబ్దకాలం వెనక్కి తిరిగి చూస్తే చాలు.. ఇందుకు ఎన్నో ఉదాహరణలు కనిపిస్తున్నాయి. శివసేన, సమాజ్‌వాదీ పార్టీ, బిజూ జనతాదళ్, ఆర్జేడీ, అన్నాడీఎంకే.. ఆ మాటకొస్తే జాతీయ పార్టీగా ఉన్న కాంగ్రెస్ కూడా ఆ జాబితాలో ఉంది. కొన్ని పార్టీల విషయంలో ఆయా నేతలకు రాజకీయ వారసులు లేకపోవడం కారణంగా కనిపిస్తుంటే, మరికొన్నింటి విషయంలో పేరుకు వారసులైనా రాజకీయ వారసత్వాన్ని కొనసాగించలేకపోవడం, నాయకత్వ లక్షణాలు లేకపోవడం కారణాలుగా కనిపిస్తున్నాయి. 'టైగర్'గా అందరూ పిలుచుకునే బాల్ థాకరే స్థాపించిన శివసేన వయస్సులో భారతీయ జనతా పార్టీ కంటే పెద్దది. 1966 జూన్ 19న ఏర్పాటైన ఈ పార్టీకి అర్థ శతాబ్దం కంటే ఎక్కువ చరిత్ర ఉంది. పార్టీ వ్యవస్థాపకుడు బాల్ థాకరే హయాంలో కేవలం మహారాష్ట్రలోనే కాదు, దేశ రాజకీయాల్లోనూ చక్రం తిప్పారు. అలాంటి పార్టీ ఇప్పుడు ఎన్నికల గుర్తునే కాదు, పార్టీ పేరును కూడా కోల్పోవాల్సి వచ్చింది. బాల్ థాకరే మరణానంతరం పార్టీని ఐకమత్యంగా ఉంచడంలో ఆయన కుమారుడు ఉద్ధవ్ థాకరే విఫలమయ్యారు. మొట్టమొదట థాకరే కుటుంబానికే చెందిన రాజ్ థాకరే వేరుపడి మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు ఏక్‌నాథ్ షిండే చీలికతో పార్టీ అసలు గుర్తును, పేరును ఉద్ధవ్ వదులుకోవాల్సి వచ్చింది. మొత్తంగా బాల్ థాకరే రాజకీయ వారసత్వాన్ని కొనసాగించడంలో ఆయన తర్వాతి తరం నేతలు విఫలమయ్యారు. ఫలితంగా పార్టీ సైతం చీలికలు, పేలికలపై తన ప్రాభవాన్ని కోల్పోయిందిశివసేన తరహాలో మహారాష్ట్రలో ఊపిరి పోసుకున్న మరో పార్టీ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ అధినాయకత్వంతో విభేధించి సొంత కుంపటి పెట్టుకుని శరద్ పవార్ ఏర్పాటు చేసిన పార్టీ ఇది. ఎంతో రాజకీయ చతురత కల్గిన ఆయన మహారాష్ట్రతో పాటు దేశ రాజకీయాల్లో చక్రం తిప్పారు. రాష్ట్రంలో పార్టీ నాయకత్వం, యంత్రాంగం పూర్తిగా ఆయనపైనే ఆధారపడింది. ఆయన పేరుతోనే పార్టీకి ఓట్లు పడ్డాయి. పూర్తి వ్యక్తికేంద్రంగా రాజకీయాలు చేస్తూ వచ్చిన ఆ పార్టీలో సొంత కుటుంబం కారణంగానే సంక్షోభం ఎదురైంది. శరద్ పవార్ మేనల్లుడు అజిత్ పవార్ పార్టీని చీల్చడమే ఎదురు దెబ్బ అనుకుంటే.. ఆ చీలిక వర్గమే అసలు పార్టీ అంటూ కేంద్ర ఎన్నికల సంఘం చెప్పడం మరో శరాఘాతంగా మారింది. శరద్ పవార్ కేంద్రంగా ఆయన చుట్టూ నడిచిన పార్టీ, గతేడాది నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకుంటానని ప్రకటించిన మరుక్షణం నుంచే బలహీనపడడం మొదలైంది. ఇది గమనించిన శరద్ పవార్ పునరాలోచించుకుని తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. పార్టీ నాయకత్వ బాధ్యతల్ని ఆశించిన మేనల్లుడు అజిత్ పవార్‌కు అవి దక్కకపోవడంతో తన వర్గం నేతలతో కలిసి చీలిక తీసుకొచ్చారు. శివసేన తరహాలోనే శరద్ పవార్ తన పార్టీ పేరును, ఎన్నికల గుర్తును కోల్పోవాల్సి వచ్చింది. అత్యధిక జనాభా, అత్యధిక సంఖ్యలో పార్లమెంట్ సీట్లు కల్గిన ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతిగా.. అందరూ ప్రేమతో నేతాజీ అని పిలుచుకునే ములాయం సింగ్ యాదవ్ స్థాపించిన సమాజ్‌వాదీ పార్టీ ఇప్పుడు గత వైభవాన్ని కోల్పోయింది. రాజ్యాధికారం పొందలేకపోయిన కులాలకు అధికారాన్ని అందించడమే లక్ష్యంగా కుల రాజకీయాలు చేసిన ఈ పార్టీ.. కాలక్రమంలో కేవలం యాదవులు, ముస్లింలకు మాత్రమే ప్రాధాన్యత కల్పించే పార్టీగా ముద్రను వేసుకుంది. వయోభారం, అనారోగ్యంతో పార్టీ పగ్గాలను తన కుమారుడు అఖిలేశ్ యాదవ్‌కు అప్పగించినప్పుడు పార్టీలో అంతర్గత విభేధాలు తలెత్తి ములాయం సోదరుడు శివ్‌పాల్ యాదవ్ వేరు కుంపటి పెట్టుకున్నారు. ఆ తర్వాత మళ్లీ అబ్బాయి అఖిలేశ్‌తో కలిసిపోయినా సరే.. పార్టీ గతంలో మాదిరిగా తన ప్రభావాన్ని చూపలేకపోతోంది. అఖిలేశ్ పగ్గాలు చేపట్టిన తర్వాత ఎదుర్కొన్న 2017, 2022 అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2019 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా పరాజయాలను చవిచూడాల్సి వచ్చింది. ములాయం చేతిలో పార్టీ ఉన్నప్పుడు వెలుగు వెలిగిన ఆ పార్టీ, ఇప్పుడు ఉనికి చాటుకోడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన అఖిలేశ్ యాదవ్, వారసత్వంగా పార్టీని, రాజ్యాధికారాన్ని అందుకోగలిగారు తప్ప తన సొంత రాజకీయ చతురత, నైపుణ్యం, నాయకత్వ లక్షణాలతో ఏదీ సాధించలేకపోతున్నారు. ఇదే రాష్ట్రంలో దళిత, బహుజన వర్గాల్లో విశేష ప్రజాదరణ కల్గిన కాన్షీరాం ఏర్పాటు చేసిన బహుజన్ సమాజ్ పార్టీ కూడా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. మాయావతి హయాంలో రాజ్యాధికారాన్ని కూడా సాధించింది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో పార్టీని విస్తరించే ప్రయత్నాలు జరిగాయి. కాన్షీరాం హయాంలో పార్టీలో ద్వితీయశ్రేణి నాయకత్వాన్ని తయారు చేయగలిగారు. కానీ మాయావతి తానే సర్వస్వం అన్నట్టుగా వ్యవహరించడంతో ద్వితీయ శ్రేణి నాయకత్వం లేకపోయింది. మాయావతి కేంద్రంగానే పార్టీ పనిచేయడం, ఆమె తప్ప ఆ పార్టీలో మరొక బలమైన నేత ఎవరూ లేకపోవడంతో.. ఇప్పుడు వారసత్వ సమస్యను ఎదుర్కొంటోంది. సోషలిస్ట్ నేత జయప్రకాశ్ నారాయణ్ ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా నిర్మించిన ఉద్యమం నుంచి ఉద్భవించిన నేతల్లో లాలూ ప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్, ములాయం సింగ్ యాదవ్, దేవెగౌడ సహా ఇంకా చాలామందే ఉన్నారు. ఆనాడు ఏర్పడ్డ జనతా పార్టీ తర్వాతి కాలంలో చీలికలు పేలికలు కాగా.. నాటి నేతలంతా తలా ఒక సొంత కుంపటి ఏర్పాటు చేసుకున్నారు.

# తుది శ్వాసవరకు బిఆర్ఎస్‌లోనే ఉంటాం

### సబిత తనయుడు కార్తీక్ రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్,మార్చి29: తాము బీఆర్ఎస్ పార్టీ వీడుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని, చివరి శ్వాస వరకు కేసీఆర్‌తోనే తమ ప్రయాణం కొనసాగుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కుమారుడు పటోళ్ల కార్తీక్ రెడ్డి తేల్చిచెప్పారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన చేవెళ్ల పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో కార్తీక్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. రంగారెడ్డి జిల్లా ప్రజల రుణం ఏనాటికీ తీర్చుకోలేనిది. నాన్న పటోళ్ల ఇంద్రారెడ్డికి ఐదు సార్లు, అమ్మ సబితమ్మకు ఐదు సార్లు అవకాశం ఇచ్చారు. 1983 నుంచి ఇప్పటి వరకు పదిసార్లు జిల్లా ప్రజల ఆశీస్సులు పొందాం. మా ప్రస్థానం వేరు.. ఇప్పుడు పార్టీలు మారుతున్న వారి ప్రస్థానం వేరు. వారికి మాకు చాలా తేడా ఉందని కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు. ఇంద్రారెడ్డికి ఎన్టీ రామారావు భిక్ష పెట్టారు. 1994లో ఆగస్టు కుంభకోణం తర్వాత ఎన్టీ రామారావుతో ఉన్న ఇద్దరు ఎమ్మెల్యేల్లో ఇంద్రారెడ్డి ఒకరు. ఎన్టీ రామారావు చనిపోయిన తర్వాత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆహ్వానంతో కాంగ్రెస్ పార్టీలో చేరాం. రాజశేఖర్ రెడ్డి ఉన్నంత వరకు ఇబ్రహీంపట్నం నుంచి తాండూరు వరకు కాంగ్రెస్ పార్టీకి ఏ కష్టం, నష్టం వచ్చినా మా అమ్మ కాలు అరిగేలా తిరిగింది. పార్టీ కోసం కష్టపడింది. నమ్మకంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ అమ్మ మీద ఐదు సీబీఐ కేసులు పెట్టింది. వేరే వారికి రెండు మూడు టికెట్లు ఇచ్చి, మాకు ఒక టికెట్ ఇచ్చి అవమాన పరిచేలా ప్రవర్తించారు. చివరకు కాంగ్రెస్ పార్టీ మమ్మల్ని ఖతం చేయాలని ఎ÷-లాన్ చేసింది. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని చెప్పి కేసీఆర్, కేటీఆర్ టీఆర్ఎస్‌లోకి ఆహ్వానించి, అవకాశాలు ఇచ్చారు. కాంగ్రెస్‌కు మేం వెన్నుపోటు పొడవలేదు. పార్టీనే మాకు వెన్నుపోటు పొడించింది. ఇప్పుడు పార్టీలు మారేవారితో మమ్మల్ని పోల్చకండి. ఏ విధంగానైతే ఎన్టీఆర్, వైఎస్సార్‌తో ఎలా ఉన్నామో కేసీఆర్ వద్ద కూడా చివరి శ్వాస ఉంటాం అని కార్తీక్ రెడ్డి తేల్చిచెప్పారు.

# బిఆర్ఎస్ మునిగిపోతున్న టైటానిక్ షిప్



### ముందుగా జైలుకు వెళ్లేది హరీష్ రావే
### రాజపుష్పతో వెంకట్రామిరెడ్డి బంధం చెప్పాలి
### బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు డిమాండ్

మెదక్,మార్చి29:బిఆర్ఎస్ పార్టీపై బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు చేసిన కామెంట్స్ తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారాయి. గులాబీ పార్టీపై రఘునందన్ రావు తీవ్ర విమర్శనాస్త్రాలు సంధించారు. బీఆర్ఎస్ మునిగిపోతున్న టైటానిక్ షిప్ అని ఎద్దేవా చేశారు. రంజిత్ రెడ్డి నుంచి కడియం కావ్య వరకు బీఆర్ఎస్ ను వీడి వెళ్లిపోతున్నారని విమర్శిస్తున్నారు. అధికారంలో ఉండగా బీఆర్ఎస్ నేతలు అనేక అక్రమాలు చేశారని ఆరోపించారు. ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేసినోళ్లు సేవ చేస్తామని వస్తున్నారు.. మెదక్ ప్రజలారా ఆలోచించాలని సూచించారు. ఇంకా ఎన్ని రోజులు అబద్ధాలు చెప్పి తెలంగాణ ప్రజలను మోసం చేస్తారని ప్రశ్నించారు. రఘునందన్ ఎవరి జోలికి వెళ్లడని తన జోలికి వస్తే మాత్రం ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. 'బీఆర్ఎస్ మోసాలను ఎండగడుతం. 17 స్థానాలు గెలిచి ప్రధాని మోదీకి మోదీకి కానుకగా ఇస్తాం అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో మొదట జైలుకు వెళ్లాల్సింది హరిశ్ రావే. దుబ్బాక ఉప ఎన్నికల్లో నన్ను, నా కుటుంబాన్ని చాలా ఇబ్బంది పెట్టారు.

తొందరగా టైటానిక్ షిప్ లో నుంచి కేసీఆర్ కుటుంబం బయటకు రావాలి. బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఆస్తులు ఎంత. రూ.17 కోట్లు అని ఎమ్మెల్సీ అఫిడవిట్ లో చూపించారు. వెంకట్రామిరెడ్డి కి రాజపుష్ప కంపెనీ తో సంబంధం ఉందో లేదో చెప్పాలని అన్నారు. గల్లీలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా దిల్లీలో మాత్రం మోదీనే ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని రఘునందన్ రావు అన్నారు. నాలుగు దశాబ్దాలుగా కాని పనులు తనను ఎంపీ గా గెలిపిస్తే చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. మెదక్ ఎన్నిక ఏకపక్షం కానుందన్న రఘునందన్ రావు ఆత్మగౌరవాన్ని కాపాడేలా పనిచేస్తానని స్పష్టం చేశారు.

# కామారెడ్డి మున్సిపాలిటీలో నేడే అవిశ్వాస తీర్మానం




కామారెడ్డి, మార్చి 29:-కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో శుక్రవారం సమావేశం అయ్యారు. కామారెడ్డి బల్దియా రాజకీయం రసవత్తరంగా సాగుతున్నది. మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి పై ఇటీవల పలువురు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీంతో అవిశ్వాస పరీక్షను ఈ నెల 30న నేడు శనివారం చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చినప్పటినుండి రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో కాంగ్రెస్ పార్టీఅవిశ్వాస తీర్మానాలు ప్రవేశ పెడుతూ ఆ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుంది. అందులో భాగంగానే కామారెడ్డి లో కూడా అవిశ్వాసం పెట్టేందుకు కలెక్టర్కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. దీంతో బిఆర్ఎస్ బిజెపి కౌన్సిలర్లు కొందరుకాంగ్రెస్ పార్టీలో చేరారు. కామారెడ్డి పట్టణమును అని విధాల అభివృద్ధి చేసుకోవాలని బిఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టిన కౌన్సిలర్లు మాజీ మంత్రి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కామారెడ్డి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు కైలాస శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి కాంగ్రెస్ కౌన్సిలర్లు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నేడేకామారెడ్డి మున్సిపల్‌చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

### కాంగ్రెస్ శిబిరంలోకి పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు
### పార్టీకి నష్టం చేయొద్దని కోరిన కేటీఆర్,

కామారెడ్డి మార్చి 29.మరో మున్సిపల్ చైర్మన్ స్థానం కాంగ్రెస్ పార్టీ చేజిక్కునే పరిస్థితి ఏర్పడింది. బీఆర్ ఎస్ పార్టీ కి షాక్ తగిలే అవకాశం కనిపిస్తోంది. కామారెడ్డి మున్సిపాలిటీ అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించేందుకు మరి కొన్ని గంటల సమయం మాత్రమే మిగిలింది. ఈ నెల 30న శనివారం నేడునిర్వహించే ప్రత్యేక సమావేశంలో ఓటింగ్ నిర్వహిస్తారు. సమావేశానికి 34 మంది సభ్యులు హాజరైతే కోరం సరిపోతుంది. కాంగ్రెస్ శిబిరంతో పాటు వారికి మద్దతిస్తున్న బీఆర్ఎస్ సభ్యులు సమావేశానికి హాజరైతే అవిశ్వాసం నెగ్గుతుంది. తద్వారా మున్సిపల్ చైర్మన్ నిట్టూ జాహ్నవి చైర్‌పర్సన్ పదవిని కోల్పోవాల్సి వస్తుంది. అయితే పార్టీ రాష్ట్ర నాయకత్వం స్థానిక బీఆర్ఎస్ నేతలపై ఒత్తిడి తీసుకువచ్చినప్పటికీ ఎలాంటి ముందడుగు పడలేదని తెలుస్తోంది. అవిశ్వాసం సమావేశానికి పార్టీ సభ్యులు హాజరు కాకుండా చూడాలని పార్టీ నేతలను ఆదేశించినప్పటికీ సరైన స్పందన రాలేదని సమాచారం. మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టూ జాహ్నవిని పదవీచ్యుతురాలిగా చేయడంలో పార్టీ నేతలు సహకరిస్తుండడం చర్చనీయాంశమైంది. కాగా కామరెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ నెట్టు జాహ్నవికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ 11వ తేదీన అవిశ్వాస నోటీసు జిల్లా కలెక్టర్కు ఇచ్చారు.

# హాస్యనటుడు, నూటొక్క జిల్లాల అందగాడు నూతన్ ప్రసాద్



### -నేడు ఆయన వర్ధంతి

హాస్యనటుడు, నూటొక్క జిల్లాల అందగాడు నూతన్ ప్రసాద్ అసలు పేరు తడినాధ వరప్రసాద్. 1970వ, 80వ దశకములో తెలుగు సినిమా రంగములో ప్రసిద్ధి చెందిన హాస్య నటుడు, ప్రతినాయకుడు. నూతన్ ప్రసాద్ 1945, డిసెంబర్ 12న కృష్ణా జిల్లా కైకలూరులో జన్మించాడు. బందరులో ఐటిఐ చదివిన ప్రసాద్, నాగార్జునసాగర్, హైదరాబాదులో ఉద్యోగాలు చేశాడు. ఎచ్ఏఎల్ లో ఉద్యోగం చేస్తున్న సమయంలో రంగస్థల నటుడు, దరశ్శకుడైన భాను ప్రకాష్ పరిచయం అయ్యాడు. భాను ప్రకాష్ స్థాపించిన 'కళారాధన' సంస్థ తరపున ప్రదరర్శించిన 'వలయం', 'గాలివాన', 'కెరటాలు' వంటి నాటకాలు ద్వారా నూతన్ ప్రసాద్ నాటకరంగానికి పరిచయమయ్యాడు. ఎ.ఆర్.కృష్ణ దర్శకత్వంలో మాలపల్లి 101 సార్లు ప్రదర్శించాడు. 1973 లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి అక్కినేని నాగేశ్వరరావు నటించిన అందాల రాముడు చిత్రంతో చిత్రరంగ ప్రవేశము చేశాడు. ఆ తరువాత నీడలేని ఆడది మొదలైన చిత్రాలలో నటించినా, ఈయనకు తొలి గుర్తింపు ముత్యాల ముగ్గు చిత్రంలో రావుగోపాలరావుతో పాటు ప్రతినాయకునిగా నటించడముతో వచ్చింది. ఈ చిత్రము విజయముతో తదుపరి అనేక చిత్రాలలో ప్రతినాయకుని పాత్రలు వచ్చాయి. అవన్నీ ఈయన తనదైన శైలిలో పోషించాడు. ఈయన తనదైన శైలిలో పలికే సంభాషణలతో ప్రతినాయక పాత్రలకు హాస్యవన్నె లద్దారు. అనేక చిత్రాలలో అగ్ర నటులైన నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఘట్టమనేని కృష్ణ, చిరంజీవి సరసన హాస్య, ప్రతినాయక, సహాయ మొదలైన విభిన్న పాత్రలు పోషించాడు. ఒక చిత్రంలో కథానాయకునిగా కూడా నటించాడు. నూతన్ ప్రసాద్ సైతాన్గా నటించిన రాజాధిరాజు చిత్రముతో ఈయన నట జీవితము తారాస్థాయికి చేరుకొన్నది. 1984 లో సుందరి సుబ్బారావు చిత్రంలో నటనకు ఆయనకు నంది పురస్కారం లభించింది. 2005 లో ఎన్టీఆర్ పురస్కారం లభించింది. తన 365వ సినిమా 'బామ్మమాట బంగారుబాట' చిత్రీకరణ సమయంలో జరిగిన ప్రమాదంలో గాయపడి కొంతకాలం నటజీవితామనికి దూరంగా ఉన్నా తిరిగి కోలుకుని నటించడం మొదలెట్టి, 112 సినిమాలలో నటించాడు. కాళ్ళు అచేతనావస్థలో ఉండిపోయిన కారణంగా పరిమితమైన పాత్రలనే పోషించగలిగాడు. 'దేశం చాలా క్లిష్టపరిస్థితిలో ఉంది' 'నూటొక్క జిల్లాల అందగాడిని' అనే డైలాగులు ప్రేక్షకాదరణ పొందాయ.

# ఊసరవెల్లి కన్నా అధ్వాన్నం వివేక్ రాజకీయం

### ఆస్తులు కాపాడుకునేందుకే కొడుక్కు టిక్కెట్
### మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఘాటు విమర్శలు



మందమర్రి,మార్చి29 : బీఆర్ఎస్‌ను కుటుంబ పాలన అని విమర్శించిన ఎమ్మెల్యే వివేక్.. తన కుటుంబంలో ఇద్దరికి ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ టికెట్ ఇవ్వడం కుటుంబ పాలన కాదా అని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రశ్నించారు. ఆస్తులను కాపాడుకునేందుకే ఊసరవెల్లి రంగులు మార్చినట్లుగా వివేక్ కుటుంబం పార్టీలు మారుతూ అధికారం కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దపల్లి ఎంపీ నియోజకవర్గంలోని మందమర్రిలో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి బాల్కసుమన్ ప్రచారం నిర్వహించారు. గత 50 ఏండ్లుగా వివేక్ కుటుంబాన్ని ప్రజలు ఆదరిస్తే ఈ ప్రాంతంలో ఒక్క ఫ్యాక్టరీ కూడా పెట్టలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది ఆగర్భ శ్రీమంతుడికి, భూగర్భ గని కార్మికుడికి మధ్య జరుగుతున్న పోటీ. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందరని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తనకు సింగరేణి బొగ్గు కార్మికుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని చెప్పారు. ఎన్నికలు రాగానే వలస పక్షులు వస్తుంటారని, తాము గెలవడానికి గ్రూప్ రాజకీయాలను ప్రోత్సహిస్తారని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థిది వారసత్వ రాజకీయమని, గత 50 ఏండ్లుగా పదవులు అనువిస్తూ వివేక్ కుటుంబం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. వాళ్ల ఆస్తుల రక్షణకు ఎన్ని పార్టీలైనా మారుతారని, ఎన్నికల్లో గెలిస్తే ప్రజల మధ్య ఉండకుడా.. వ్యాపారాలు, పరిశ్రమలు చూసుకుంటూ హైదరాబాద్‌లో ఉంటారని విమర్శించారు.

# టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం


### ఎన్టీఆర్ చిత్రపటానికి కనకమేడల నివాళి

న్యూఢిల్లీ,మార్చి29: టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ , కార్యాలయం సిబ్బంది పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కనకమేడల మాట్లాడుతూ..టీడీపీ స్థాపించి 43 ఏళ్లు అయ్యిందన్నారు. తెలుగు ప్రజల అభిమాన నాయకుడు, నటరత్న ఎన్టీఆర్ అని తెలిపారు. తెలుగు ప్రజలందరికీ కనకమేడల శుభాకాంక్షలు తెలిపారు. ఎన్టీ రామారావు పార్టీ స్థాపించిన ఆరు నెలలు తిరగకుండానే అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్టీఆర్ సమాజమే దేవాలయమని పిలుపునిచ్చారని కనకమేడల పేర్కొన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, రెండు రూపాయలకు కిలో బియ్యం ఎన్టీఆర్ ఇచ్చిన విషయాన్ని కనకమేడల గుర్తు చేశారు. రైతులకు 50 రూపాయలకు ఎన్టీఆర్ కరెంట్ అందించారని తెలిపారు. అనేక ఏళ్ల పాటు టీడీపీ అధికారంలో ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అనేక సేవలు అందించారన్నారు. కేంద్రంలో కాంగ్రెసేతర ప్రభుత్వ ఏర్పాటులో ఎన్టీఆర్‌ది కీలక పాత్ర అని పేర్కొన్నారు. ఏపీలో కొన్ని దుష్ట శక్తులతో పార్టీ బలహీన పడిందని.. కానీ ఈ ఎన్నికల్లో టీడీపీ అధికారం చేపడుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు సాధిస్తామన్నారు. టీడీపీ కేంద్రంలో కీలకపాత్ర పోషిస్తుందని కనకమేడల తెలిపారు.

# పంటలు వేసుకుంటే నీళ్లిస్తామని మోసం

### ఎండిన పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

సూర్యాపేట,మార్చి29: ఎస్సారెస్పీ కింద నీళ్లు ఇస్తాం పంటలు వేసుకోండని చెప్పి మరి ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఎండిపోయిన పంట పొలాలేదర్శనమిస్తున్నాయని జగదీష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం



తుంగతుర్తి మండలం వెలుగుపల్లి, మొండి కుంట తండా గ్రామాల్లో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం, ప్రాజెక్టులు, నీళ్లపై కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీస అవగాహన లేదన్నారు. ఎస్సారెస్పీ కింద కాళేశ్వరం నీళ్లతో గత నాలుగేళ్లుగా వరుసగా రెండు పంటలకు నీళ్లు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీది. రైతులు కోట్ల రూపాయల అప్పుల్లో కురుకుపోయారు. ఆయినా ప్రభుత్వానికి సోయిలేదని మండిపడ్డారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని ఆరోపించారు. రైతుల తరపున పేగులు తేగేదాక దాక కొట్లాడుతామని స్పష్టం చేశారు .ప్రభుత్వం మెడలు వంచి నష్టపరిహారం అందించేంతవరకు మా పోరాటం ఆగదు. ఈ సమయంలో కూడా కాళేశ్వరం లో నీళ్లు ఎత్తి పోసి నీళ్లు అందించే అవకాశం వున్నా కావాలని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. జిల్లా మంత్రులు ఎండిన పొలాల వద్దకు పోకుండా రేవంత్ బూట్లు తుడుస్తున్నారని ఘాటుగా విమర్శించారు. జిల్లా మంత్రులు? కోమటిరెడ్డి లాంటి చిల్లర నాయకుడుకి కేసీఆర్‌ని విమర్శించే స్థాయి లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కరువు పైన సర్వే చేయించి రైతులని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.




# మూవీ రివ్యూ : 'టిల్లు స్క్వేర్'

సంగీతం: రామ్ మిరియాల-అచ్చు రాజమణి నేపథ్య సంగీతం: భీమ్స్ సిసిరోలియో ఛాయాగ్రహణం: సాయిప్రకాష్ ఉమ్మడిసింగు రచన-సిద్ధు జొన్నలగడ్డ-రవి ఆంటోనీ నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ-సాయి సౌజన్య దర్శకత్వం: మల్లిక్ రామ్ రెండేళ్ల కిందట సెన్సేషనల్ హిట్ అయిన 'డీజే టిల్లు'కు సీక్వెల్ గా తెరకెక్కిన చిత్రం.. టిల్లు స్క్వేర్. దీని మీద అంచనాలు మామూలుగా లేవు. ఈ రోజే విడుదలైన 'టిల్లు స్క్వేర్' ఆ అంచనాలను ఏమేర అందుకుందో చూద్దాం పదండి. కథ: రాధిక అనే అమ్మాయి చేతిలో గట్టి ఎదురు దెబ్బ తిన్నాక డీజే టిల్లు (సిద్ధు జొన్నలగడ్డ).. టిల్లు ఈవెంట్స్ పేరుతో కంపెనీ పెట్టి వెడ్డింగ్ ఈవెంట్లు చేసుకుంటూ ఉంటాడు. అలాంటి టైంలో అతడికి అనుకోకుండా ఒక పార్టీలో లిల్లీ (అనుపమ పరమేశ్వరన్) పరిచయం అవుతుంది. ఒక్క రాత్రిలో ఇద్దరికీ సాన్నిహిత్యం పెరిగి ఇద్దరూ ఒక్కటవుతారు. ఉదయానికి లిల్లీ మాయమవతుంది. ఆమె కోసం టిల్లు వెతికి వెతికి అలసిపోయాక అనుకోకుండా ఓ ఆసుపత్రిలో కనిపించి తాను ప్రెగ్నెంట్ అంటుంది. ఇరు కుటుంబాల పెద్దలు మాట్లాడి ఇద్దరికీ పెళ్లి చేయాలని అనుకుంటారు. ఇంతలో టిల్లు పుట్టిన రోజు వస్తుంది. ఆ రోజు లిల్లీని కలవడానికి వెళ్లి టిల్లుకు షాకుల మీద షాకులు తగులుతాయి. లిల్లీ అసలు స్వరూపం వేరని.. తనో మిషన్ కోసం తనను వాడుకుందని టిల్లుకు అర్థమవుతుంది. ఇంతకీ లిల్లీ ఎవరు.. తన మిషనేంటి.. అందుకోసం టిల్లు ఏం చేయాల్సి వచ్చింది.. ఈ విషయాలన్నీ తెర మీదే చూసి తెలుసుకోవాలి. కథనం-విశ్లేషణ: 'డీజే టిల్లు' అనే సినిమా ఒకటి తయారై ప్రేక్షకుల ముందుకు రావడానికి కొన్ని రోజుల ముందు వరకు పెద్దగా సౌండేమీ లేదు. కానీ ఆ సినిమా ట్రైలర్ బయటికి రాగానే.. ఈ క్యారెక్టరేదో భలే ఇంట్రెస్టింగ్ గా ఉందే అనిపించింది. ముఖ్యంగా టిపికల్ డైలాగ్ డెలివరీతో సిద్ధు జొన్నలగడ్డ ప్రోమోల్లో చెప్పిన డైలాగ్స్ యువ ప్రేక్షకులకు గట్టిగా తాకాయి. ఇక ఆ సినిమాలో టిల్లు పాత్రలో సిద్ధు చేసిన అల్లరి అంతా ఇంతా కాదు. తమ గురించి ఎక్కువ బిల్డప్పులిచ్చుకుంటూ.. ఊరికే హడావుడి చేస్తూ.. తమ చుట్టూ ఉన్న వాళ్లను ఎంటర్టైన్ చేసే సిద్ధు తరహా కుర్రాళ్లు గల్లీ గల్లీలో కనిపిస్తారు. వాళ్లు అతిగా బిల్డప్పులిస్తారు కానీ.. ఎవరికీ హాని చేయరు. మన చుట్టూ కనిపించే ఇలాంటి కుర్రాళ్లకు ప్రతిరూపంలా అనిపించే టిల్లు పాత్రను సిద్ధు రచయితగా భలే గమ్మత్తుగా తీర్చిదిద్దడమే కాదు.. నటుడిగా ఆ పాత్రను పండించిన తీరు ప్రేక్షకులకు భలేగా నచ్చేసింది. రిలీజ్ తర్వాత నెలలు గడిచేకొద్దీ సోషల్ మీడియా పుణ్యమా అని కల్ట్ స్టేటస్ తెచ్చుకుంది ఈ పాత్ర. ఇప్పుడు 'డీజే టిల్లు' కథను పొడిగిస్తూ తీసిన 'టిల్లు స్క్వేర్'లోనూ టిల్లు క్యారెక్టర్లో సిద్ధు చేసిన అల్లరే హైలైట్. ఫస్ట్ పార్ట్ లో మాదిరే కథ మామూలుగానే అనిపించినా.. ఏమాత్రం పదును తగ్గని వన్ లైనర్స్.. బోర్ కొట్టని కథనం.. అనుపమ గ్లామర్.. అన్నింటికీ మించి టిల్లు పాత్రలో సిద్ధు పెర్ఫామెన్స్ సినిమాను యువత మెచ్చే నాన్ స్టాప్ ఎంటర్టైనర్ గా తీర్చిదిద్దాయి. ఒక స్టయిల్లో సాగిపోయే వినోదం కొంచెం రిపిటీటివ్ గా అనిపించినా అదేమంత సమస్య కాదు ప్రేక్షకులకు బాగా అలవాటైన.. నచ్చిన పాత్రను కొనసాగిస్తూ సినిమా తీసినపుడు కొన్ని సానుకూలతలు ఉంటాయి. అలాగే కొన్ని ప్రతికూలతలూ ఉంటాయి. ఆ పాత్రను కొత్తగా పరిచయం చేసి.. ఎస్టాబ్లిష్ చేయాల్సిన పని లేదు. ప్రేక్షకులకు దాంతో ఒక కనెక్షన్ ఏర్పరచడానికి ప్రత్యేక కసరత్తూ అవసరం లేదు. ఆ పాత్రే సినిమాను డ్రైవ్ చేస్తుందనే భరోసా ఉన్నపుడు కథ గురించి కూడా మరీ ఆలోచించాల్సిన అవసరం లేదు. ఈ సానుకూలతలన్నింటినీ 'టిల్లు స్క్వేర్' టీం ఉపయోగించుకుంది. డీజే టిల్లు పాత్ర జోష్ ఏమాత్రం తగ్గని విధంగా అదే స్టయిల్ వన్ లైనర్స్ తో సిద్ధు అండ్ టీం కావాల్సిన ఎంటర్టైన్మెంట్ డోస్ ఇచ్చేసింది. దీంతో సినిమా ఎక్కడా బ్రేకుల్లేకుండా సాగిపోయింది. టిపికల్ డైలాగ్ గెలివరీతో సాగే నాన్ స్టాప్ వన్ లైనర్స్ తో సిద్ధు ప్రేక్షకులను సినిమా అంతా వినోదాన్ని పంచుతూనే సాగాడు. ఐతే ఆల్రెడీ ఒక సినిమాలో చూశాం. ఇప్పుడు ఇంకో సినిమా. రెంటిలోనూ వినోదం ఒకే తరహాలో సాగడం.. సిద్ధు డైలాగుల మీదే భారమంతా పడిపోవడంతో ఒక దశ దాటాక చూస్తున్నదే చూస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. సిద్ధు ఏం మాట్లాడతాడో.. ఏం పంచ్ పేలుస్తాడో.. అతని రియాక్షన్ ఎలా ఉ



ంటుందో ముందే అర్థమైపోతుంటుంది. కథ పరంగా కూడా ఏదీ కొత్తగా అనిపించదు. హీరోయిన్ పాత్ర ఎంట్రీ.. ఆ తర్వాత తన తీరు చూస్తేనే ఇదేదో తేడా వ్యవహారంలా ఉందని ప్రేక్షకులకు తెలిసిపోతుంది. దీంతో హీరో తాను మరోసారి మోసపోయానని తెలిసి షాకవుతుంటే.. దాని చుట్టూ వినోదం పండించాలని చూస్తుంటే అదేమంత ఎగ్జైటింగ్ గా అనిపించదు. కథలో ట్విస్టులకు లోటు లేదు కానీ.. అవేవీ మరీ పేలిపోయే రేంజిలో అయితే లేవు. కన్వీనియెంట్ గా ఏదో అలా నడిచిపోతాయంతే రెండుంబావు గంటల నిడవిలో 'టిల్లు స్క్వేర్' బోర్ కొట్టించిన సందర్భాలైతే చాలా తక్కువ. చాలా సాధారణంగా అనిపించే విషయాల మీద కూడా పంచ్ ఉన్న వన్ లైనర్ రాసి.. వాటిని టిపికల్ డైలాగ్ డెలివరీతో ప్రెజెంట్ చేయడంలోనే 'టిల్లు' పాత్ర బలమంతా దాగి ఉంది. పైల్స్ కంప్లైంట్ తో డాక్టర్ని కలిసిన తండ్రితో మాట్లాడుతూ.. "మైదా పిండి మధ్యలో నీ పేగులున్నాయా.. పేగుల మధ్య మైదాపిండి ఉందా".. "ఒక పైప్ పెట్టి లోపల నీ మైదా ఉద్యమాన్ని 4కేలో చూపిస్తారు" అనడం.. వంశం పౌరుషం అని ఇంకో సందర్భంలో మాట్లాడుతున్న తండ్రితో.. "పెన్షన్ కోసం ఫేక్ సర్టిఫికెట్ రెడీ చేయించిన నువ్వా వంశం గురించి మాట్లాడుతున్నావ్" అనడం.. "ఇక్కడ ఎవరు ఎవరితో ఆడుతున్నారో కానీ.. నన్ను మాత్రం ప్రతిసారీ ఇంపాక్ట్ ప్లేయర్ గా దించుతున్నారు"... "ఈ హరాస్మెంట్ నేను భరించలేకున్నాను.. అర్జెంటుగా సిక్ లీవ్ అప్లై చెయ్యాలి. దయచేసి అప్రూవ్ చెయ్" లాంటి ట్రెండీ వన్ లైనర్స్ ప్రేక్షకుల ముఖాల్లో చిరునవ్వును చెరగనీయవు. ఓవైపు సిద్ధు పాత్ర కావాల్సినంత వినోదం పంచుతుంటే.. అనుపమ పాత్ర సైతం యూత్ మెచ్చేలా సాగడం.. పాటలు కూడా హుషారు పుట్టించడంతో 'టిల్లు స్క్వేర్' ప్రథమార్థం రయ్యిన సాగిపోతుంది. ఇంటర్వెల్లో 'డీజే టిల్లు' కనెక్షన్ ఎంటర్టైన్మెంట్ డోస్ ను ఇంకా పెంచుతుంది. హీరోయిన్ పాత్రకు సంబంధించిన ట్విస్టు మాత్రం ఏమంత సర్ప్రైజింగ్ కాదు. మాఫియా డాన్ వ్యవహారం కూడా మామూలుగా అనిపిస్తుంది.

కాకపోతే సిద్ధు మాత్రం తన ఎంటర్టైన్మెంట్ తను ఇస్తూనే ఉంటాడు. మధ్యలో రాధిక పాత్రలో నేహా ఎంట్రీ ఇచ్చి కాసేపు వినోదాన్ని పంచుతుంది. క్లైమాక్స్ కొంచెం మామూలుగానే అనిపిస్తుంది. అనుపమ పాత్రకు ఇచ్చిన ముగింపు ఓకే. తక్కువ నిడివి 'టిల్లు స్క్వేర్'కు పెద్ద ప్లస్. టిల్లు పాత్రకు ఆల్రెడీ బాగా కనెక్ట్ అయిన వాళ్లను 'టిల్లు స్క్వేర్' ఈజీగా టైంపాస్ చేయించేస్తుంది. అలవాటైన వినోదమే అయినా.. మరోసారి పేలింది ఇందులో. నటీనటులు: సిద్ధు జొన్నలగడ్డ మరోసారి టిల్లు పాత్రలో అల్లరల్లరి చేశాడు. తనతో పాటు ప్రేక్షకులకూ బాగా అలవాటైన పాత్రను అతను అలవోకగా చేసుకుపోయాడు. దీన్నొక కల్ట్ క్యారెక్టర్ గా మార్చేశాడతను. తన హావభావాలు.. డైలాగ్ డెలివరీ యువ ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంటాయి. టిల్లు పాత్రలో సిద్ధు లుక్ కూడా బాగుంది. తనకు కనెక్ట్ అయితే చాలు రెండుంబావు గంటలు సాఫీ గా సాగిపోతాయి. అనుపమ పరమేశ్వరన్ పాత్ర ప్రోమోల్లో ఉన్నంత క్యూరియస్ గా అయితే సినిమాలో లేదు. ఆమె పాత్ర సోసోగా అనిపిస్తుంది. కానీ ఇప్పటిదాకా ఏ సినిమాలో లేనంత గ్లామరస్ గా కనిపించడమే కాదు.. లిప్ లాక్స్ మోత మోగిస్తూ కుర్రాళ్లకు కావాల్సినంత కిక్ ఇస్తుంది అనుపమ. రాధికగా నేహా శెట్టి కాసేపు రీఎంట్రీ ఇచ్చి బాగానే ఆకట్టుకుంది. హీరో తండ్రి పాత్రలో మురళీధరన్ మరోసారి

మంచి వినోదం పంచాడు. మాఫియా డాన్ క్యారెక్టర్లో మురళీ శర్మ.. పోలీస్ బాస్ పాత్రలో అనీష్ కురువిల్లా ఓకే అనిపించారు. సాంకేతిక వర్గం: టిల్లు స్క్వేర్ మ్యూజిక్ మంచి హుషారు పుట్టిస్తుంది. 'డీజే టిల్లు' టైటిల్ సాంగ్ కొత్త లిరిక్స్ తో మరోసారి మెప్పించగా.. టిక్కెట్టే కొనకుండా కూడా మంచి ఊపునిచ్చే పాటే. మిగతా పాటలు కూడా ఓకే. భీమ్స్ సిసిరోలియో బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా బాగానే సాగింది. 'టిల్లు' థీమ్స్ నే వాడుకుంటూ అతను జోష్ నింపాడు. సాయిప్రకాష్ ఉమ్మడిసింగు కెమెరా పనితనం ఓకే. విజువల్స్ కలర్ ఫుల్ గా సాగాయి. నిర్మాణ విలువలకు ఢోకా లేదు. సిద్ధు జొన్నలగడ్డ మరోసారి రైటింగ్ తోనే మార్కులు కొట్టేశాడు. అక్కడే సినిమా సగం సక్సెస్ అయిపోయింది. రవి ఆంటోనీతో కలిసి అతను అందించిన స్క్రిప్ట్ సింపుల్ గానే అనిపిస్తూ ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది. సిద్ధు మార్కు వన్ లైనర్స్ సినిమాకు మేజర్ హైలైట్. దర్శకుడు మల్లిక్ రామ్.. 'డీజే టిల్లు' ఫ్లేవర్ ను కొనసాగిస్తూ నీట్ గా సినిమా తీశాడు.



## కల్కి వాయిదా వేస్తున్నారా?

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898' ఇప్పటికే రిలీజ్ తేదిని ప్రకటించిన సంగతి తెలిసిందే. మే 9న వరల్డ్ వైడ్ గా రిలీజ్ చేస్తున్నట్లు అధికారిక ప్రకటనా వచ్చేసింది. ఎట్టి పరిస్థితుల్లో ఆ తేదీకి వచ్చేస్తుందని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేసాయి. కానీ ఇప్పుడా సమీకరణాలు మారుతున్నట్లు తాజాగా అందుతోన్న సమాచారం. ప్రస్తుతం ఏపీలో ఎన్నికల వేడి ఎలా ఉందో తెలిసిందే. ఇప్పటికే అన్ని పార్టీలు ప్రచారం పనుల్లో బిజీ అయ్యాయి. చంద్రబాబు నాయుడు..పవన్ కళ్యాణ్ ఎవరికి వారుగా ప్రచారంలో బిజీ అయ్యారు. టాలీవుడ్ లో 100 డేస్ టార్గెట్! అధికారిక పార్టీ కూడా మొన్నటి నుంచి ప్రచారం మొదలు పెట్టేసింది. ఇప్పుడు జనాలంతా ఆ పార్టీల వెనుకే కనిపిస్తున్నారు. మే 9 అంటే ఎన్నికల తేదికి అతీ సమీపంలో ఉంది. ఆ సమయంలో సినిమా రిలీజ్ అన్నది సరైన సమయం కాదని తాజాగా చిత్ర వర్గాల్లో చర్చకొచ్చిందిట. ప్రేక్షకులంతా ఎన్నికల హడావుడి లో ఉంటారు. అప్పుడు రిలీజ్ చేస్తే ప్రేక్షకులు థియేటర్ కి వచ్చి చూసే సన్నివేశం ఉంటుందా? అన్న సందేహం మొదలైనట్లు కనిపిస్తోంది. ఇప్పటికే థియేటర్లకి జనాలు రావడం లేదనే బెంగ ఉంది. ఇలాంటి కన్



ఫ్యూజన్ నడుమ రిలీజ్ అయితే సినిమాకి నష్టం వాటిల్లుతుందని భావిస్తున్నారుట. దీంతో రిలీజ్ తేదీ మార్చే ప్లాన్ లోఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయం డిస్ట్రిబ్యూటర్లు అందరికీ చెవిన వేసినట్లు తెలిసింది. అయితే మే 9 గనుక కోల్పోతే మళ్లీ ఆగస్టులోనే రిలీజ్ ఉంటుందని తెలిసింది. సరిగ్గా 'పుష్ప-2' రిలీజ్ కి ముందుగానీ..తర్వా త గానీ రిలీజ్ అయ్యేలా ప్రత్యామ్నాయం వెతుకుతున్నారుట. అదే గనుక జరిగితే బాక్సాఫీస్ వద్ద వార్ తప్పదు. హిందీ మార్కెట్లో బన్నీ..ప్రభాస్ కి మంచి క్రేజ్ ఉంది. పుష్పకి భారీ ఎత్తున వసూళ్లు వచ్చినవన్నీ నార్త్ మార్కెట్ నుంచే. ఇక డార్లింగ్ హిందీ మేనియా కొంత కాలంగా కొనసాగుతూనే ఉంది. అలాంటి సమయంలో రెండు సినిమాలు రిలీజ్ అయితే ఇబ్బంది ఎలా ఉంటుందోచెప్పాల్సిన పనిలేదు. థియేటర్ల సర్దుబాటు నుంచే యుద్ధం మొదలవుతుంది. ఆ తర్వాత అది ఫ్యాన్ వార్ గానూ దారి తీస్తుంది. రెండు సినిమాల ఓపెనింగ్ లు..లాంగ్ రన్ వసూళ్లపై తీవ్ర ప్రభావం పడుతుంది. కాబట్టి కల్కి ఆగస్టు కి వెళ్తే గనుకు చాలా సమస్యలు ఉత్పన్నం అవుతాయి.

## స్టార్ హీరో ప్రేమ – నవ్వు – యుద్ధం

తమిళ స్టార్ హీరో సూర్య త్వరలో కంగువా సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. కోలీవుడ్ బాహుబలి అంటూ కంగువా సినిమా ను తెగ ప్రమోట్ చేస్తున్నారు. మరో వైపు సుధ కొంగర దర్శకత్వంలో కూడా సూర్య ఒక సినిమా ను చేస్తున్న విషయం తెల్సిందే. తాజాగా మరో సినిమాను సూర్య కమిట్ అయ్యాడు.సూర్య తాజాగా తన కొత్త సినిమాను కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో చేయబోతున్నాడు. తాజాగా సినిమాకు సంబంధించిన ప్రీ లుక్ ను రిలీజ్ చేశారు. విభిన్న చిత్రాల దర్శకుడిగా పేరు దక్కించుకున్న కార్తీక్ సుబ్బరాజు ఇప్పటికే సూర్య సినిమా కోసం విభిన్నమైన టైటిల్ 'లవ్ లాఫర్ వార్' (ప్రేమ – నవ్వు – యుద్ధం) ను ఖరారు చేసినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం కార్తీక్ సుబ్బరాజు




సినిమా యొక్క స్క్రిప్ట్ పై వర్క్ చేస్తున్నాడని సమాచారం అందుతోంది. సూర్య ప్రస్తుతం చేస్తున్న సినిమాలతో సంబంధం లేకుండా ఈ సినిమాను త్వరలోనే పట్టాలెక్కించే అవకాశాలు కనిపిస్తున్నాయి అని తమిళ మీడియా వర్గాల్లో టాక్ వినిపిస్తుంది.సూర్య కంగువ తో పాటు సుధ కొంగర దృకత్వంలో చేస్తున్న సినిమాలకు పూర్తి విభిన్నమైన సినిమాగా ఈ సినిమా ను గురించి ప్రచారం జరుగుతుంది. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఈ మధ్య కాలంలో వచ్చిన సినిమాలు విమర్శకుల ప్రశంసలు దక్కించుకోవడంతో పాటు పాన్ ఇండియా రేంజ్ లో అందరి దృష్టిని ఆకర్షించాయి. కనుక సూర్య, కార్తీక్ సుబ్బరాజు సినిమా కచ్చితంగా పాన్ ఇండియా రేంజ్ లో మంచి బజ్ క్రియేట్ చేసే అవకాశాలు ఉన్నాయి.

## ఈ లక్షణాల్లో ఏ ఒక్కటి ఉన్నా మీ శరీరంలో ఏదో లోపం ఉందని అర్థం అవుతుంది... జాగ్రత్త!



ఆరోగ్యవంతమైన శరీరం ప్రతి ఒక్కరి కల. అయితే అందుకు ముందస్తు జాగ్రత్తలు, నిర్వహణ తీసుకుంటున్నామా లేదా అన్నది కచ్చితంగా తెలియదనే చెప్పాలి. ఆరోగ్యం పట్ల మనం చూపే ఉదాసీనత మన శరీరానికి అతి పెద్ద శత్రువు. మనం తరచుగా పట్టించుకోని కొన్ని సాధారణ లక్షణాలు చాలా తీవ్రమైన ఆరోగ్య సమస్యను సూచిస్తాయి. ఈ లక్షణాలు చిన్నవిగా అనిపించినప్పటికీ, వాస్తవానికి అవి మనకు చాలా ప్రమాదకరంగా మారతాయి. మీరు నిర్లక్ష్యం చేయకూడని లక్షణాలు ఏమిటో ఈ పోస్ట్‌లో చూడవచ్చు.ఆకస్మిక బరువు తగ్గడం ఆకస్మిక బరువు తగ్గడం బరువు తగ్గడం వల్ల అలసట, నిరంతర అలసట ఉంటుంది. కానీ మీరు బరువు తగ్గడానికి ప్రయత్నించకుండానే 6 నెలల్లో మీ శరీర బరువులో 10 శాతానికి పైగా కోల్పోవడం మీరు ఆందోళన చెందాల్సిన విషయం. పురాతన కాలం నుంచి వాడుతున్న 'ఈ' ఆకు మీ షుగర్ లెవెల్స్‌ని అదుపులో ఉంచడంలో సహాయపడుతుందా?పురాతన కాలం నుంచి వాడుతున్న 'ఈ' ఆకు మీ షుగర్ లెవెల్స్‌ని అదుపులో ఉంచడంలో సహాయపడుతుందా? మానసిక కల్లోలం మానసిక కల్లోలం మూడ్‌లో తరచుగా వచ్చే మార్పులు బైపోలార్ డిజార్డర్, డిస్టిమియా మరియు ప్రమాదకరమైన మానసిక రుగ్మతల వంటి తీవ్రమైన మానసిక ఆరోగ్య సమస్యలకు దారి తీయవచ్చు. ఇది మీకే కాదు ఇతరులకు కూడా ప్రమాదం కలిగిస్తుంది. డయాబెటిస్‌ను నివారించడంలో మరియు నియంత్రించడంలో అల్లం మీకు సహాయపడుతుందా? స్టడీ ఏం చెబుతుందో తెలుసా?డయాబెటిస్‌ను నివారించడంలో మరియు నియంత్రించడంలో అల్లం మీకు సహాయపడుతుందా? స్టడీ ఏం చెబుతుందో తెలుసా? తలనొప్పి తలనొప్పి స్వల్పకాలిక తలనొప్పి, రాత్రిపూట తలనొప్పి, తెల్లవారుజామున తీవ్రం కావడం మరియు నొప్పి నివారణ మందుల ద్వారా నయం కాకపోవడం వంటి తలనొప్పి జ్వరం లేదా మెనింజైటిస్ వంటి తీవ్రమైన రుగ్మతకు సంకేతం. తల్లి తన బిడ్డకు రోజుకు ఎన్నిసార్లు పాలివ్వాలి మరియు ఎంత మొత్తంలో ఇవ్వాలో తెలుసా?తల్లి తన బిడ్డకు రోజుకు ఎన్నిసార్లు పాలివ్వాలి మరియు ఎంత మొత్తంలో ఇవ్వాలో తెలుసా? అలసట అలసట నిరంతర బలహీనత మరియు అలసట క్రానిక్ ఫెటీగ్ సిండ్రోమ్ యొక్క లక్షణం కావచ్చు. సరైన పరిష్కారం కోసం వెంటనే వైద్యుడిని సంప్రదించండి నిరంతర దగ్గు నిరంతర దగ్గు నిరంతర దగ్గు, బరువు తగ్గడం మరియు తక్కువ-స్థాయి జ్వరం కూడా తీవ్రమైన అనారోగ్యం యొక్క లక్షణాలు కావచ్చు. ఇది క్షయ లేదా క్యాన్సర్ కావచ్చు మరియు అసలు కారణాన్ని తెలుసుకోవడానికి ఛాతీ ఎక్స్-రే చేయాలి. ఛాతి నొప్పి ఛాతి నొప్పి మీరు ఆకస్మిక ఒత్తిడి, బిగుతు లేదా ఛాతీ కింద అణిచివేసినట్లు భావిస్తే. మీ దవడ, ఎడమ చేయి లేదా వెనుకకు వ్యాపించే నొప్పి గుండెపోటు కావచ్చు. ఈ లక్షణాలను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకండి. నిరంతర జ్వరం నిరంతర జ్వరం నిరంతర తక్కువ-స్థాయి జ్వరం దీర్ఘకాలిక సంక్రమణకు సంకేతం కావచ్చు. ఇది బరువు తగ్గడం, కీళ్ల నొప్పులు లేదా పొత్తికడుపు నొప్పితో పాటుగా ఉంటే, అది ఇన్ఫెక్షన్ లేదా వాపు యొక్క సంకేతం కావచ్చు. నెమ్మదిగా నయం నెమ్మదిగా నయం గాయాలు ఏర్పడితే అవి త్వరగా నయం అవుతాయి. కానీ ప్రత్యామ్నాయంగా గాయాలు మానడానికి చాలా సమయం తీసుకుంటే అది ఏదో తప్పుకు సంకేతం కావచ్చు. సాధారణంగా మధుమేహ కణాలు నెమ్మదిగా పునరుత్పత్తికి దారితీస్తాయి, తద్వారా వైద్యం ప్రక్రియ మందగిస్తుంది. శ్వాసలోపం లేదా గురక శ్వాసలోపం లేదా గురక అనేక విభిన్న పరిస్థితులు మీ శ్వాసను ప్రభావితం చేయవచ్చు.

## సొంత దేశాన్ని వీడి యూఎస్ఏకు ఆడనున్న ఫాస్టెస్ట్ సెంచరీ హీరో

వన్డేల్లో సెకెండ్ ఫాస్టెస్ట్ (36 బంతుల్లో) సెంచరీ వీరుడు, న్యూజిలాండ్ మాజీ ఆల్‌రౌండర్ కోరె ఆండర్సన్ సొంత దేశాన్ని వీడి అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పుడిప్పుడే అడుగులు వేస్తున్న యూఎస్ఏకు ఆడేందుకు సిద్దమయ్యాడు.త్వరలో కెనడాతో జరుగబోయే 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం యూఎస్ఏ సెలెక్టర్లు ఆండర్సన్ ఎంపిక చేశారు.2018 నవంబర్‌లో చివరిసారిగా న్యూజిలాండ్‌కు ప్రాతినిథ్యం వహించిన ఆండర్సన్.. వ్యక్తిగత కారణాల చేత 2020లో యూఎస్ఏకు షిఫ్ట్ అయ్యాడు. అప్పటి నుంచి అక్కడే దేశవాలీ క్రికెట్ (మైనర్ లీగ్ క్రికెట్) ఆడుతూ ఐదేళ్ల నిరీక్షణ అనంతరం జాతీయ జట్టుకు ఆడే అవకాశాన్ని దక్కించుకున్నాడు.లోకల్ కేటగిరీలో మేజర్ లీగ్ క్రికెట్ ఆడే అవకాశం దక్కించుకున్న ఆండర్సన్.. ముంబై ఇండియన్స్ న్యూయార్క్ తరఫున మెరుగైన ప్రదర్శనలు చేశాడు. కెనడా సిరీస్ కోసం ఆండర్సన్‌తో పాటు మరికొందరు నాన్ ఆటగాళ్లు కూడా ఎంపికయ్యారు. భారత అండర్-19 ఫేమ్ హర్మీత్ సింగ్ యూఎస్ఏ దేశవాలీ టోర్నీలతో పాటు మేజర్ లీగ్ క్రికెట్‌లో సియాటిల్ ఆర్కాస్ తరఫున రాణించి జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు. హర్మీత్‌తో పాటు మరో భారత క్రికెటర్ కూడా యూఎస్ఏ జట్టుకు ఎంపికయ్యాడు.ఢిల్లీ మాజీ ఆటగాడు, ఐపీఎల్‌లో ఆర్సీబీ ప్లేయర్ మిలింద్ కుమార్ అక్కడి దేశవాలీ క్రికెట్‌లో సత్తా చాటి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. వీరితో పాటు కెనడా జాతీయ జట్టు మాజీ కెప్టెన్, భారత మూలాలున్న నితీశ్ కుమార్ కూడా యూఎస్ఏ జట్టుకు ఎంపికైన వారిలో ఉన్నారు. తాజాగా ప్రకటించిన యూఎస్ఏ జట్టులో భారత అండర్-19 మాజీ క్రికెటర్, ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ మాజీ బ్యాటర్ ఉన్ముక్త్ చంద్‌కు చోటు దక్కలేదు. ఉన్ముక్త్‌కు నితీశ్ కుమార్ నుంచి తీవ్ర పోటీ ఎదురైంది. అంతిమంగా సెలెక్టరు? నితీశ్‌పైపే మొగ్గు చూపారు.కెనడా సిరీస్ కోసం ఎంపిక చేసిన యూఎస్ఏ జట్టు: మోనాంక్ పటేల్ (కెప్టెన్), ఆరోన్ జోన్స్ (వైస్ కెప్టెన్), కోరె అండర్సన్, గజానంద్ సింగ్, జెస్సీ సింగ్, సౌరభ్ నేత్రావల్కర్, నిసర్గ్ పటేల్, స్టీవెన్ టేలర్, ఆండ్రీస్ గౌస్, హర్మీత్ సింగ్, షాడ్లీ వాన్ షాల్క్‌విక్, నోస్తుష్ కెంజిగే, మిలింద్ కుమార్, నితీష్ కుమార్, ఉస్మాన్ రఫిక్



# ఒక్క ప్రమాదం నలుగురిలో...... విషాదం.....

## టేక్మాల్ మండల బూత్ అధ్యక్షులు, సోషల్ మీడియా వారియర్స్ తో మీటింగ్.....



**ఆందోల్ శ్రీ ప్రస్థానం ప్రతినిధి :-** జహీరాబాద్ బిజెపి పార్లమెంట్ సభ్యులు బిబి పాటిల్ గారు గురువారం రాత్రి టేక్మాల్ మండల కేంద్రంలో బూత్ అధ్యక్షులు సోషల్ మీడియా వారియర్స్ తో మీటింగ్ జరిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి భూత్ స్థాయి కార్యకర్త మరియు సోషల్ మీడియా వారియర్స్ కృషి చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో అందోల్ కన్వీనర్ మఠం చంద్రశేఖర్,టేక్మాల్ మండల పార్టీ అధ్యక్షులు నవీన్ గుప్తా ప్రధాన కార్యదర్శి కుమ్మరి సిద్దిరాములు, మాజీ మండల అధ్యక్షులు ఎల్లుపేట్ రాజు,ఉపాధ్యక్షులు వడ్డె రాములు, బీజేవైఎం అధ్యక్షులు పవన్,అశోక్,చల్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.





**పాపన్నపేట శ్రీ ప్రస్థానం ప్రతినిధి :-** మెదక్ జిల్లా పాపన్నపేట మండలం బాచారం గ్రామానికి చెందిన ఒక్క రోడ్డు ప్రమాదం.. నాలుగిళ్లలో తీరని విషాదాన్ని నింపింది. ఓ వైపు పెళ్లి బాజాలు, మరోవైపు బంధువులు, మిత్రుల సంతోషం, ముచ్చట్లతో సంతోషంగా ఉన్న ఆ పెళ్లి ఇల్లు శోకసంద్రంలో మునిగిపోయింది. పచ్చని పందిరి సిద్ధం చేస్తుండగా.. విధి వక్రీకరించింది. బుధవారం పెళ్లి కుమార్తెను తీసుకొచ్చేందుకు 30 మంది బంధువులు ట్రాక్టర్‌పై వెళ్తుండగా బోల్తాపడటంతో ముగ్గురు మహిళలు మృత్యువాతపడ్డారు. ఈ ఘటన మరువకముందే గురువారం వరుడి తాత మనోవేదనతో ఆత్మహత్య చేసుకోవడం మరింత కలిచివేసింది.వరుడి ఇంటి వద్దే..: పాపన్నపేట మండలం బాచారానికి చెందిన సొంగ గౌరగారి పెంటయ్య (68), పాపమ్మ దంపతులకు ఏకైక కుమార్తె శ్యామమ్మ ఉన్నారు. కుమారులు లేకపోవడంతో శ్యామమ్మను ఇదే గ్రామానికి చెందిన పోచయ్యతో వివాహం చేసి ఇల్లరికం తెచ్చుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు రమేష్, కృష్ణ ఉన్నారు. పెద్ద కుమారుడు రమేష్‌కు ఇటీవల అందోలుకు చెందిన మమతతో వివాహం నిశ్చయమైంది. వరుడి ఇంటి వద్ద గురువారం జరగాల్సిన పెళ్లికి అన్ని ఏర్పాట్లు చేశారు. పెళ్లికుమార్తెను తీసుకొచ్చేందుకు వరుడి సమీప బంధువులు 30 మంది ట్రాక్టర్‌లో అందోలుకు బయల్దేరారు. మన్‌సానిపల్లి మలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడటంతో ముగ్గురు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు.భర్తకు అండగా..:ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో మృతిచెందిన వారందరికీ వ్యవసాయమే ఆధారం. ఈ ఘటనలో మృతి చెందిన జట్టిగారి సంగమ్మ (47), గోపాల్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సాయికుమార్ ఉన్నారు. కుమార్తెలందరికీ వివాహాలు జరిగాయి. సాయికుమార్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. గోపాల్ ఇటీవల పక్షవాతం బారినపడ్డాడు. సంగమ్మ ఓ వైపు వ్యవసాయం చేస్తూ, మరోవైపు భర్త ఆలనాపాలన చూసుకుంటోంది. ప్రమాదంలో సంగమ్మ మృతి చెందడంతో తనకెవరు దిక్కని గోపాల్ రోదన అందరినీ కంటతడిపెట్టించింది.అందరివీ వ్యవసాయ కుటుంబాలే..? ఈ ఘటనలో మృతి చెందిన రావుగారి భూదమ్మ (50).. భర్త కిష్టయ్య పదేళ్ల కిందట మృతి చెందాడు. కుమారుడు లక్ష్మీనారాయణ, కుమార్తె ఉన్నారు. భర్త చనిపోయాక కుటుంబ భారమంతా భూదమ్మపైనే పడింది. వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ అందరినీ పెంచి పెద్ద చేసింది. అందరికీ వివాహాలు జరిగాయి.? మరో మృతురాలు రావుగారి ఆగమ్మ (50)కు భర్త మల్లయ్య, కుమార్తె మహేశ్వరి ఉన్నారు. వీరికి వ్యవసాయమే ఆధారం. కుమారులు లేకపోవడంతో కుమార్తెకు వివాహం చేసి అల్లుడిని ఇల్లరికం తెచ్చుకున్నారు.ఉలిక్కిపడిన బాచారం:గ్రామస్థులంతా పెళ్లికి సిద్ధమవుతుండగా, ఇంతలో ట్రాక్టరు బోల్తా పడిన విషయం తెలియడంతో అందరూ హతాశులయ్యారు. మృతులందరూ సమీప బంధువులు కావడంతో ఆనందం కాస్త ఆవిరైంది. దీనికితోడు వృద్ధుడి ఆత్మహత్య మరింత కలచివేసింది. గత ఫిబ్రవరి 19న ఇదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఘటన మరువక ముందే మరో నలుగురు మృతి చెందడంతో బాచారం గ్రామం ఉలిక్కిపడింది. బాధిత కుటుంబాలను మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు గురువారం సాయంత్రం పరామర్శించారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నరేందర్ గౌడ్, శ్రీనివాస్, గణేష్, తదితరులున్నారు.మనోవేదనతో తాత..బంధువులంతా శోకసంద్రంలో మునిగిపోగా, తన మనవడి పెళ్లి ఆగిపోయిందని రమేష్ తాత పెంటయ్య మనోవేదనకు గురయ్యాడు. గురువారం తెల్లవారుజామున ఇంట్లోని ఓ గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ వైపు రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, వృద్ధుడి బలవన్మరణంతో బంధువులు, గ్రామస్థుల రోదనలు మిన్నంటాయి......

## ముదిరాజ్ సంఘం భవన ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానం.



**శ్రీ ప్రస్థానం న్యూస్ పటాన్చెరు?** పటాన్ చెరు మండలం బచ్చుగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘం భవన ప్రారంభోత్సవానికి రావాలని ముదిరాజ్ సంఘ సభ్యులు పటాన్ చెరు యువ నాయకుడు మాదిరి ప్రిథ్వీరాజ్ గారిని ఆహ్వానించారు. బుధవారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రం అందించారు. ముఖ్య అతిధిగా దేవేందర్ రాజు కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఈ భవన నిర్మాణం పూర్తి కావడం కోసం మాదిరి దేవేందర్ రాజు గారు తన వంతుగా ఆర్థిక సాయం అందించారు. ఏప్రిల్ 2, ఉదయం 11.30కు నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు.

## భారతీయ జనతా పార్టీ పోలింగ్ బూత్ కమిటీ సమావేశంలో పి.ఎం సాయి



**శ్రీ ప్రస్థానం మేడ్చల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ :** మల్కాజ్గిరి లోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్‌లో భారతీయ జనతా పార్టీ పోలింగ్ బూత్ కమిటీ సమావేశంలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు.మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటెల రాజేంద్ర బీజేవైఎం నేషనల్ ట్రెజర్ పీఎం సాయి ప్రసాద్ మరియు పార్టీ సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలుహాజరైనందుకు గౌరవం.కలిసి, మన దేశానికి ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేద్దాం అన్నారు.

## గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవ భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి.



**మెదక్ శ్రీ ప్రస్థానం:-** ప్రపంచంలోనే ఆసియా ఖండంలో రెండవ అతి పెద్దదైన ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా వేలాది మంది భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వ హించారు. ఉదయం 11.30 గంటలకు శిలువను ఊరే గించిన అనంతరం మధ్యా హ్నం 2 గంటల వరకు ప్రార్థనలు జరిగాయి.ప్రత్యేక ప్రార్థనల మధ్య భక్తులు గురువుల



ఆశీర్వాదాలు పొందారు. శుభ శుక్రవారం ఏసుక్రీస్తు ప్రాణత్యాగం చేసిన రోజు. శిలువకు తనకు తానే లోక పాపములను పోగొట్టుటకు శిలువ ఎక్కాడు.ఆ దినము నా పలికిన 7 ప్రవచనాలను భక్తులు ధ్యానం చేయడం ఈ రోజు ప్రత్యేకత. చర్చి ప్రేసీబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంత య్య దైవ సందేశం చేశారు.ఏసు శిలువ వేయబడిన తర్వాత తన చివరి ఏడు మాటల గురించి భక్తులకు వివరించారు. ఈ సందర్భం గా ఏసయ్య భక్తి గీతాలు ఆలపించారు గుడ్ ఫ్రైడే సందర్భంగా మెదక్ డయాసిస్ పరిధి లోని పలు జిల్లాల నుంచి క్రైస్తవులు భారీగా తరలి రావడంతో చర్చి ప్రాంతం కిటకిటలాడింది...

## గుడ్ ఫ్రైడే సందర్భంగా లింగోజిగూడ లో బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి..



**శ్రీ ప్రస్థానం మేడ్చల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ :** గుడ్ ఫ్రైడే సందర్భంగా లింగోజిగూడా డివిజన్ పరిధిలోని బేతల్ చర్చి నందు పాల్గొన్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మరియు మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఏం.పీ.అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రైస్తవసోదర,సోదరీమణులందరకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నాగారం లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం..



**శ్రీ ప్రస్థానం మేడ్చల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ :**నాగారం మున్సిపాలిటీ పరిధిలో మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి సునితా మహేందర్ రెడ్డి టీపీసీసీ ఉపాధ్యక్షులు మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ మేడ్చల్ జిల్లా పద్మశాలి మహిళా సంక్షేమ సంఘం ఆద్వర్యంలో నాగారంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంనిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సునితా మహేందర్ రెడ్డి టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు మహిళలకు పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు.రోజుల్లో మహిళలు రాజకీయంగా ఎదగాలన్నారు

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మదన్ రెడ్డి భేటీ

### బి ఆర్ ఎస్ ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరనున్ననర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి



**నర్సాపూర్ (శ్రీ ప్రస్థానం ప్రతినిధి)**సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి.మెదక్ జిల్లాలో బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. టీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ సీఎం కేసీఆర్ కు అత్యంత సన్నిహితుడైన నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చినుముల మదన్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డిని తన నివాసంలో కలిశారు. కేసీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ మండలానికి చెందిన ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి కూడా రేవంత్ రెడ్డిని కలిశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు, టీపీసీసీ కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈగ శ్వేత రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు..





**శ్రీ ప్రస్థానం మేడ్చల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ :** మేడ్చల్ నియోజకవర్గం, దమ్మైగూడమున్సిపాలిటీ ఆర్ జి కే కాలనీ నందు మున్సిపల్ మహిళా జనరల్ సెక్రెటరీ ఈగ శ్వేత రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథులుగా హాజరైన టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ బి బ్లాక్ అద్యక్షులు మహేష్ గౌడ్. మైనార్టీ నాయకులు మొహమ్మద్ ముజీబ్ మున్సిపల్ నాయకులు దుర్గ ప్రసాద్ గౌడ్. దుర్గం శ్రీనాథ్ .మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఇక మండే కాలమే...



హైదరాబాద్, మార్చి 29 దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిపోయాయి. సాధారణంతో పోలిస్తే 2?3 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. తెలంగాణతోపాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో వేడి సెగలు రేగుతున్నాయి. గత రెండు నెలలకు సంబంధించి ఈ రాష్ట్రాల్లో అత్యంత లోటు వర్షపాతం కొనసాగుతున్నట్టు వాతావరణ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తీవ్ర వర్షాభావం,అధిక వేడి ఉండే ఎల్‌నినో పరిస్థితులు జూన్ వరకు కొనసాగే అవకాశం కనిపిస్తోందని.. అంటే వచ్చే రెండు నెలలు ఎండల మంటలు తప్పకపోవచ్చని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ ఇప్పటికే హెచ్చరికలు కూడా జారీ చేశాయి. దేశవ్యాప్తంగా ఈ వేసవికాలంలో భానుడి భగభగలు తప్పకపోవచ్చని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. ఆసియా ఖండంలోని దేశాల్లో తీవ్ర వర్షాభావం, అధిక వేడికి కారణమయ్యే ఎల్‌నినో పరిస్థితులు జూన్ వరకు కొనసాగవచ్చని పేర్కొంటున్నారు. భారత వాతావరణ శాఖ కూడా దీనిపై ఇప్పటికే ప్రకటన జారీ చేసింది. ఈసారి సాధారణం కంటే అధికంగా వడగాడ్పులు వీయవచ్చని కూడా అంచనా వేసింది. పరిస్థితులు కూడా ఇందుకు అనుగుణంగానే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం (మార్చి చివరివారంలో) ఉండాల్సిన సాధారణ ఉష్ణోగ్రతల కంటే రెండు, మూడు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వాతావరణ శాఖ గణాంకాలు చెప్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ, పశి?చమ భారత రాష్ట్రాలు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్‌లలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. తీవ్రమవుతున్న ఎండల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రజలకు హెచ్చరికలు, మార్గదర్శకాలు జారీ చేసింది. తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు కూడా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించాయి. ఉత్తర భారతంలోనూ పలు ప్రాంతాల్లో ఎండలు మండుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో సాధారణం కంటే మూడు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో వాతావరణంలో తేమ శాతం పెరిగిపోతుండటంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. దీనికితోడు పలు ప్రాంతాల్లో వేడిగాలులు వీస్తుండటం మరింత సమస్యగా మారిందని నిపుణులు చెప్తున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయట తిరగకూడదని, ఆరు బయట అధిక శారీరక శ్రమతో కూడిన పనులు చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి గారితో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి భేటీ..



**శ్రీ ప్రస్థానం న్యూస్ పటాన్చెరు**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే బీ అర్ ఎస్ నాయకుడు మదన్ రెడ్డి గారు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.ముఖ్యమంత్రి తో మదన్ రెడ్డి సమావేశం అయిన సమయంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి తో పాటు నర్సాపూర్ కాంగ్రెస్ మరియు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

## బిజెపి మండల కార్యదర్శిగా కాస వెంకటేష్ నియామకం



**నర్సాపూర్ (శ్రీ ప్రస్థానం ప్రతినిధి)**భారతీయ జనతా పార్టీ మండల కార్యదర్శి గా (ఆర్) వెంకటాపూర్ గ్రామానికి చెందిన 4వ మాజీ వార్డ్ మెంబెర్ కాస వెంకటేష్ నీ బీజేపీ నాయకులు, ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు రాకేష్ , బూత్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి ,గణేష్, కుమార్, సతీష్ ,శ్రీకాంత్, దుర్గేష్ , సందీప్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJETHA PRINTERS,H. NO: 46/801BHUDHAWARPETA, KURNOOL DIST,-518001, ANDHRA PRADESH, INDIA . PUBLISHED AT. H.NO 43/217A, NR PETA, KURNOOL DIST, ANDHRA PRADESH, INDIA. EDITOR PERUMALLA CHENNAKESHAVULU RNI NO: APTEL 2020/80757